అనుదినం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
మంగళవారం 18 ఏప్రిల్ 2023

సిగ్నల్ పరిమితి పెంచాలని కలెక్టర్‌కు వినతి

ఖానాపూర్ రూరల్ : మండలంలోని మారుమూల రాజురా, బావాపూర్(ఆర్) గ్రామాల్లో సెల్ టవర్ పరిమితి పెంచాలని కోరుతూ పెంబి జెడ్పీటీసీ బుక్యా జానుబాయి సోమవారం కలెక్టర్ వరుణ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మండలంలోని రాజురా, బావాపూర్(ఆర్) గ్రామాలలో సెల్ టవర్ ఉన్నప్పటికీ సిగ్నల్ సరిగా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర సమయాలలో, పింఛను, రేషన్ తీసుకునే సమయాలలో సిగ్నల్ అందక ఆ గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. బూస్టర్ రెట్టింపు చేసి సిగ్నల్ పెంచే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విన్నవించారు. ఆమె వెంట గ్రామస్తులు ఉన్నారు.



ఆటోలోంచి పడి బాలికకు గాయాలు

నవతెలంగాణ - కౌటాల

ప్రయివేట్ పాఠశాలకు పరిమితికి మించి విద్యార్థులతో వెళ్తుండగా బాలిక కింద పడి గాయపడింది. సోమవారం మండల కేంద్రంలోని వాహిని ప్రయివేటు పాఠశాలకు ముత్తంపేట్ నుండి పరిమితికి మించి పిల్లలను ఎక్కించుకొని ఆటో వస్తుండగా మార్గమధ్యలో డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయడంతో అంజలి కిందపడడంతో ముఖానికి దెబ్బలు తగిలాయి. ఈ విషయం తెలుసుకున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మారుతి స్థానిక ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి ఇంటికి పంపించారు. ఆటోను నిర్లక్ష్యంగా నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగింది. పరిమితికి మించి విద్యార్థులను, ప్యాసింజర్‌లను ఆటోలో ఎక్కించడం వల్లనే రోజురోజుకు ప్రమాదాలు పెరిగిపోతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. పోలీసులు చూసీచూడనట్టు వ్యవహరించడం దీనికి ప్రధాన కారణమని పలువురు ఆరోపిస్తున్నారు. దీనిపై మండల విద్యాధికారి స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని మండల వాసులు కోరుతున్నారు.

ఉష్ణోగ్రతలను అధిగమించేందుకు చర్యలు చేపట్టాలి



నవతెలంగాణ - రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా ఖైరిగూడ ఓసీలో రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలను అధిగమించేందుకు యుద్ధప్రాతిపదికన నివారణ చర్యలు చేపట్టాలని గని మేనేజర్ ప్రవీన్ పాంటింగ్‌కు సోమవారం ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి సోమారం తిరుపతి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల రెండో వారం నుండి సింగరేణి ఓపెన్‌కాస్టులో 47డిగ్రీలు రికార్డు అవుతున్నందున కార్మికులు క్వారీలో పనిచేసే పరిస్థితి లేదని, ఈ విషయాన్ని యాజమాన్యం గమనించాలని తెలిపారు. ఎండ బారిన పడి కార్మికులు ప్రాణాపాయానికి గురయ్యే అవకాశముందన్నారు. రానున్న రోజుల్లో పగటిపూట ఉష్ణోగ్రతలు ప్రస్తుతం ఉన్నదానికంటే మరింత అధికంగా పెరిగే అవకాశం ఉన్నందున తక్షణమే పని వేళలు మార్చాలని, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సరైన సమయంలో కార్మికులకు అందజేయాలని, ఓసీలో జనరల్ మజ్దూర్ కార్మికులకు రెస్టు సెంటర్ నిర్మించాలని, చల్లని నీటి సదుపాయం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ గోలేటి ఆర్గనైజింగ్ కార్యదర్శులు రెహమాన్, జగ్గయ్య, శేషు, మారం శ్రీనివాస్, చంద్రశేఖర్, కిరణ్‌బాబు, ఖైరిగూడ కార్యదర్శి దివాకర్ పాల్గొన్నారు.

రైతు హక్కుల సాధనలో ఏఐకేఎస్

నవతెలంగాణ-తాండూర్

రైతు హక్కులు, సమస్యలపై అనునిత్యం పోరాటం చేస్తూ రైతు సంక్షేమం కోసం పాటుపడుతున్న సంఘం ఏఐకేఎస్ అని జిల్లా కార్యదర్శి కొండు బానేష్ అన్నారు. సోమవారం అఖిల భారత కిసాన్ సభ 88వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 ఏప్రిల్ 1936 నుండి రైతుల హక్కుల కోసం అఖిల భారత కిసాన్ సభ ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నామన్నారు. సంఘం పోరాటంతో మద్దతు ధర గ్యారంటీ చట్టం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇందారపు రాజేష్, మండల రైతు సంఘం కార్యదర్శి కంబాల చందు, కొండు సాయికుమార్, ఠాకూర్ శ్యాంసింగ్, కరవెన కళావతి, మేడి రాజేశ్వరి, ఉప్పుట్ల నర్సమ్మ, పోశం, సరిత, పోశం పాల్గొన్నారు.

పాము కాటుతో యువతి మృతి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

పాము కాటుతో పెందూర్ దేవుబాయి(18) మృతి చెందినట్లు ఎస్సై డి.సునీల్ తెలిపారు. కుటుంబ సభ్యులు సోమవారం చేనులో పనులు దేవుబాయిని పాము కాటు వేసిందన్నారు. గమనించిన కుటుంబీకులు ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఆమె మరణించిందని తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో కిరాణషాపు దగ్ధం

నవతెలంగాణ - కౌటాల

మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద జైశ్వాల్ వినోద్‌కు చెందిన కిరాణషాపులో సోమవారం తెల్లవారు జామున షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఒక్కసారిగా పొగలు రావడంతో స్థానికులకు అనుమానం వచ్చి షాపు యజమానికి సమాచారం అందించారు. క్షణంలో మంటలు పెద్దఎత్తున చెలరేగాయి. మంటలు ఆర్పేందుకు ఎంతమంది ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. షాపులో రూ.35వేల నగదు, ఫ్రిజ్, కౌంటర్, కిరాణ వస్తువులు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. సుమారు రూ.2లక్షల వరకు నష్టం జరిగినట్టు షాపు యజమాని తెలిపారు.

అనాథ ఆడబిడ్డ వివాహానికి ఆర్థికసాయం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని బూరుగూడ గ్రామానికి చెందిన అనాథ ఆడబిడ్డ వివాహానికి అదే గ్రామానికి చెందిన గాజుల ప్రసాద్, గాజుల శివ రూ.5వేలు అందజేశారు. చిలారి నానయ్య, పద్మ కొన్ని సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మరణించారు. వారికి ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. ఈ నెల 24న పెద్ద కుమార్తె వివాహం నిశ్చయమంది. పెళ్లి ఖర్చులకు డబ్బులు లేకపోవడంతో గ్రామానికి చెందిన గాజుల ప్రసాద్, ఆయన తమ్ముడు గాజుల శివ ఆర్థిక సాయం చేశారు. వివాహం రోజు కానుకలు అందచేస్తామన్నారు. వీరివెంట గ్రామస్తులు పూదరి శ్రీను, గజ్జెల సురేష్, మెకార్తి అరుణ్, రవి, బొమ్మెన ధర్మయ్య, గోపాల్, నరేష్ ఉన్నారు.

మురళీగూడలో వైద్యశిబిరం

నవతెలంగాణ - పెంచికల్‌పేట్

మండలంలోని మురళీగూడ, జిల్లెడ గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం వైద్యసిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షల కోసం వచ్చిన వారి నుండి 26 మంది రక్త నమూనాలు సేకరించి జ్వరాలతో బాధపడుతున్న వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రవిదాస్, ల్యాబ్ టెక్నీషియన్ నాగరాజు, హెల్త్ అసిస్టెంట్ ధర్మారావు, ఏఎన్ఎం లక్ష్మి, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఖానాపూర్‌రూరల్

కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ బీర్ల లక్ష్మి అన్నారు. సోమవారం బావాపూర్(కే) గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. నేటి నుండి ఈ నెల 20 వరకు కొనసాగునున్న కంటి వెలుగు కార్యక్రమంలో 18 సంవత్సరాల పైబడిన వారంతా ఉచిత కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. అవసరమైన వారికి కళ్ళజోళ్ళతో పాటు మందులు సైతం ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందని చెప్పారు. అలాగే వైద్య సిబ్బంది శ్రీవిద్య, తిరుమల సాయి, చరణ్ సింగ్ ప్రజలకు కంటి పరీక్షలు, కంటి వెలుగుపై పూర్తి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ప్యారిలాల్, ఏఎన్ఎంలు గంగామణి, స్వప్న, నాయకులు బీర్ల నర్సయ్య, మల్లయ్య, ఆశా వర్కర్లు నర్మద, లావణ్య, లక్ష్మి, అంగన్వాడీ కార్యకర్త, గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యాపార సముదాయాల వేలం వాయిదా

ఖానాపూర్‌రూరల్: పట్టణంలోని మున్సిపాలిటీకి సంబంధించిన వ్యాపార సముదాయాల వేలం మొదట సోమవారం నిర్ణయించారు. నిర్ణయించిన తేదీకి ఐదు డీడీలు రావడంతో మున్సిపల్ కమిషనర్ రత్నాకర్‌రావు ఈ వేలం నిర్వహించడం వీలు కాదని, తిరిగి ఈ నెల 20న నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ వేలం నిర్వహణ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, ఫ్లోర్ లీడర్ రాజుర సత్యం, కౌన్సిలర్ కావలి సంతోష్‌తో పాటు నాయకులు సుమన్, జన్నారం శంకర్, మున్సిపల్ సిబ్బంది, స్థానిక వ్యాపారులు పాల్గొన్నారు.

ఐకేపీ వీఓఏల సమ్మె ప్రారంభం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సమస్యల పరిష్కారం కోసం ఐకేపీ వీఓఏలు సోమవారం నుండి సమ్మె ప్రారంభించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి బీమా సౌకర్యం కల్పించాలని, గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతి నెలా వేతనాలను వీఓఏల వ్యక్తిగత ఖాతాల ద్వారా చెల్లించాలనే తదితర డిమాండ్లతో సమ్మె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ముంజం ఆనంద్‌కుమార్, వీఓఏల సంఘం జిల్లా కార్యదర్శి సిరిశెట్టి శ్రీనివాస్‌గౌడ్, కాగజ్‌నగర్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ధన్‌రాజ్, అంకయ్య, వీఓఏలు అనిత, పొన్న గీత, తిరుపతి, లలిత్ మండల్, రాంచందర్, లత, మోహన్, భీంరావు, పురుషోత్తం పాల్గొన్నారు.



కౌటాల : వీఓఏలు ఐకేపీ కార్యాలయం ముందు నిరవధిక సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా వీఓఏల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెలుములె దత్తు మాట్లాడుతూ తమ డిమాండ్లను ఒప్పుకొనే వరకు సమ్మె విరమించేదిలేదన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రతి ఒక్కరికి సాధారణ బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎస్ఐ ప్రవీన్‌కుమార్‌కు అందజేశారు.



పెంచికల్‌పేట్ : మండల కేంద్రంలోని స్వర్ణజ్యోతి మండల సమాఖ్య కార్యాలయం ముందు వీఓఏలు సమస్యల పరిష్కారం కోసం సోమవారం వీఓఏలు నిరవధిక సమ్మె ప్రారంభించారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం అధ్యక్షురాలు రోజా, కార్యదర్శి తులసీరాం, సాద్గరి రవి, బాగీలాల్, సంగీత, అంకిత, ఉమా పాల్గొన్నారు.

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్ట్

- కేసు వివరాలు వెల్లడించిన ఎస్పీ
- నలుగురు అరెస్ట్, పరారీలో ఇద్దరు
- వాహనాలు స్వాధీనం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలో వరుస ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగల ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోమవారం మావల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి కేసు వివరాలను వెల్లడించారు. వరుస చోరీలకు పాల్పడుతున్న నలుగురు నిందితులను అరెస్టు చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. దొంగల వద్ద నుంచి 19 బైక్‌లు, 5 గ్రాముల బంగారు ఆభరణాలు, 10 తులాల వెండి సామాగ్రి, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వేర్వేరు ప్రాంతాలకు చెందిన నలుగురు ముఠాగా ఏర్పడ్డారు. జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు చేయడం మొదలు పెట్టారు. చోరీ చేసిన బైక్‌లను మహారాష్ట్రలో విక్రయించి వచ్చిన సొమ్ముతో ఎంజాయ్ చేసేవారు. అనేక ఫిర్యాదులు అందిన నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి



పట్టుకున్నారు. తాటిగూడకు చెందిన సయ్యద్ ఫారూక్, వడ్డెర కాలానికి చెందిన టెంపు సురేష్, మంచిర్యాలకు చెందిన షైక్ అక్బర్, కిన్వట్‌కు చెందిన బాలాజీ అభిమాన్ మన్యను పట్టుకున్నారు. కేఆర్కే కాలానికి చెందిన మాడే రతన్, కిన్వట్‌కు చెందిన ఆదిల్, గొకుంద పరారీలో ఉన్నారు. ఆదివారం ఉదయం 8గంటల ప్రాంతంలో నిందితులు ఫారూఖ్, టెంపు సురేష్, షైక్ అక్బర్ అనుమానాస్పదంగా దస్నాపూర్ ఏరియాలో తిరుగుతుండగా సమాచారం మేరకు మావల పోలీసులు పట్టుకొని విచారించగా నేరం ఒప్పుకున్నారు. పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని ఎస్పీ వెల్లడించారు. దొంగలను పట్టుకోవడంలో, చోరీ అయిన నగదును రికవరీ చేయటంలో ప్రత్యేక చొరవ చూపిన ఎస్ఐ విష్ణువర్ధన్, ఏఎస్ఐ జె సవిత, కానిస్టేబుల్ ఎంఏ కరీం, శివాజీలను అభినందించారు. వీరికి ప్రత్యేక రివార్డ్ ఇస్తామని పేర్కొన్నారు. సమావేశంలో డీఎస్పీ ఉమేందర్, రూరల్ సీఐ రఘుపతి, ఎస్ఐ విష్ణువర్ధన్ ఉన్నారు.

సింగరేణి కార్మికులతోనే బొగ్గు తీయించాలి

- జేఏసీ ఆధ్వర్యంలో ఖైరిగూడ ఓపెన్‌కాస్ట్ వద్ద ధర్నా



నవతెలంగాణ - రెబ్బెన

ఖైరిగూడ ఓపెన్‌కాస్టులోని బొగ్గును సింగరేణి కార్మికులు తీయాల్సి ఉండగా ఓబీ కాంట్రాక్టర్ ద్వారా బొగ్గు తీయించడాన్ని వ్యతిరేకిస్తూ టీబీజీకేయస్, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, డీఎంఎస్, సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నాయకులు సైట్ కార్యాలయం ముందు బైటాయించి పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సింగరేణిలో ప్రయివేటీకరణను, కాంట్రాక్టీకరణను అధికారులు ప్రోత్సహిస్తున్నారని, వెంటనే వారి వైఖరిని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. సరైన మిషనరీ, మ్యాన్‌పవర్ అందిస్తే సింగరేణి కార్మికులు ఎంతటి పని చేయడానికైనా సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం ఖైరిగూడ ప్రాజెక్టు ఆఫీసర్ ఉమాకాంత్, గని మేనేజర్ ప్రవీన్ పాంటింగ్ ధర్నా చేస్తున్న నాయకుల వద్దకు వెళ్లి వారితో చర్చించారు. నాయకులు బొగ్గును ప్రయివేటు వ్యక్తులతో బొగ్గు తీయించడాన్ని వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. మొదటగా ప్రాజెక్టు ఆఫీసర్ ఈ విషయాన్ని పైఅధికారుల దృష్టికి తీసుకెళ్తానని ధర్నా విరమించాలన్నారు. అయినప్పటికీ వెంటనే నిర్ణయం చెప్పాలని, బొగ్గు ప్రయివేటు వారు తీయడాన్ని నిలిపివేస్తేనే ధర్నా విరమిస్తామని నాయకులు తేల్చిచెప్పారు. దీంతో ఉన్నతాధికారులతో మాట్లాడిన ప్రాజెక్టు ఆఫీసర్ కార్మికులు, నాయకులు కోరిన విధంగా సింగరేణి వారితోనే బొగ్గు తీయిస్తామని, ఆర్డర్‌లో ఉన్న విధంగా పనులు చేయిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రాజెక్టు ఆఫీసర్ ఇచ్చిన మాటను గౌరవించి ధర్నా విరమిస్తున్నామని, మాటను నిలబెట్టుకోనట్టయితే పెద్దఎత్తున ఆందోళన చేసి గని ఉత్పత్తిని స్తంభింపజేస్తామని, ఎంతటి పోరాటానికైనా వెనుకాడేదిలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీబీజీకేయస్ బెల్లంపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాస్‌రావు, ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి సోమారం తిరుపతి, ఐఎన్‌టీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి పేరం శ్రీనివాస్, డీఎంఎస్ వైస్ ప్రెసిడెంట్ ఓరుకొండ తిరుపతి, సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి అంబాల ఓదెలు, నాయకులు సంఘం ప్రకాష్‌రావు, నలగొండ సదాశివ్, మారిన వెంకటేశ్, గజ్జెల్లి చంద్రశేఖర్, కృష్ణ, సంజీవరెడ్డి, మారం శ్రీనివాస్, జగ్గయ్య, శేషు, ఫిట్ కార్యదర్శులు కార్నాదం వెంకటేశం, నాయకులు ఓరం కిరణ్, తిరుపతి, భాస్కరచారి పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన జడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ-సారంగాపూర్

బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, జెడ్పీటీసీ ఫోరం జిల్లా అధ్యక్షులు, మండల జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కొంత కాలంగా బీఆర్ఎస్ పార్టీకి దూరంగా ఉంటూ తాజాగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. హైదరాబాద్‌లోని టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి నివాసంలో ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధినేత రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- ఎంపీపీ కుమ్రు తిరుమల విశ్వనాథ్
- జైనూర్, లింగాపూర్ మండలాల్లో పలుకలు పంపిణీ



నవతెలంగాణ - జైనూర్

విజ్ఞాన సోషల్ యాక్టివిటీస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బడి బయట ఉన్నవారికి పలుకలు పంపిణీ చేయడం అభినందనీయమని ఎంపీపీ కుమ్రు తిరుమల విశ్వనాథ్ అన్నారు. సోమవార జైనూర్, లింగాపూర్ మండలాల్లో ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఎంపీడీఓ ప్రభుదయ, సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ నాగేశ్వర్‌రావు, డివిజన్ కోఆర్డినేటర్ అడ గణపతిరావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఇంతియాజ్‌లాల, ఆత్రం అనిల్‌తో కలిసి పలుకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజ్ఞాన వెల్ఫేర్ సొసైటీ ప్రజల కోసం నిరంతరం కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ సొసైటీ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇచ్చి నిరుద్యోగ శాతాన్ని నిర్మూలించడం, బడిబయట ఉన్న పిల్లలను బడికి పంపించడం లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వ పథకాల పట్ల గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు రక్తహీనత శిబిరాలు ఏర్పాటు చేసి రక్తహీనతతో బాధపడుతున్న వారికి రక్తం అందించడమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. సమాజంలో మూఢనమ్మకాలపై క్షేత్రస్థాయిలో పేద ప్రజలకు అవగాహన కల్పించి జనాబా నియంత్రణ కోసం అవగాహన కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. చదువుకోని మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి వారికి స్వయం ఉపాధి పొందేలా, నిరక్షరాస్యులకు అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఆత్రం శంకర్, బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ జాటోత్ రాహుల్, విజ్ఞాన సోషల్ గ్రామ పంచాయతీ నాయకులు జగదీష్, రాము, లలిత పాల్గొన్నారు.

రీక్యాప్ వెంకట్‌కు దళితరత్న అవార్డు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ ఏటా అందించే దళితరత్న అవార్డును ఈ ఏడాది కాగజ్‌నగర్‌కు చెందిన రీక్యాప్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు పెరుమాళ్లపల్లి వెంకట్‌కు అందించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 132వ జయంతిని పురస్కరించుకొని జయంతి ఉత్సవ కమిటీ ఛైర్మన్, రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖా మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా ఆదివారం హైద్రాబాద్‌లో వెంకట్ ఈ అవార్డును అందుకున్నారు. వెంకట్ 20 ఏళ్లుగా రీక్యాప్ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం, జాతీయ బాల కార్మిక ప్రాజెక్టు ద్వారా బాలకార్మిక నిర్మూలనకు కృషి చేయడం, మైక్రో ఫైనాన్స్, ఎస్ హెచ్‌జీ గ్రూపులు, ఎపీసీఎఫ్ఎం ప్రాజెక్టు, మైక్రో లైఫ్ ఇన్సూరెన్స్, ఆర్‌బీసీ సెంటర్, సర్వశిక్ష అభియాన్ మొదలగు కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని అందించిన సేవలకు గాను అధికారుల మన్ననలు పొంది పదుల సంఖ్యలో కలెక్టర్‌ల చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫుడ్స్ ఛైర్మన్ రాజీవ్‌కుమార్, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్, జాతీయ ప్రధాన కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

మందమర్రి ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ - కాసిపేట

మందమర్రి ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, సర్పంచ్ వేముల కృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ 15న దళిత సామాజిక వర్గానికి చెందిన బెల్లంపల్లి మండలంలోని చాకెపల్లి ఎంపిటిసి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గం అధ్యక్షుడు ముడిమడుగుల మహేందర్ భార్యాభర్తల గొడవపై వచ్చిన ఫిర్యాదు విషయంలో ఎస్ఐతో మాట్లాడే ప్రయత్నం చేశాడన్నారు. ఎవరు ఏమిటి అని తెలుసుకోకుండానే ఎస్ఐ ఇష్టారాజ్యంగా అసభ్య పదజాలంతో స్టేషన్‌కు ఎందుకొచ్చావని మాట్లాడాడని తెలిపారు. ప్రజాప్రతినిధి పట్లనే ఈ రకంగా మాట్లాడితే సామాన్య ప్రజల పట్ల ఎలా వ్యవహరిస్తారో అర్థం చేసుకోవచ్చన్నారు. పోలీస్ శాఖ ఒక వైపు పోలీస్‌స్టేషన్‌కు ఎవరు వచ్చినా వారితో మర్యాదతో మాట్లాడాలని చెబుతుంటే ఈ ఎస్ఐ మాత్రం ఇలా వ్యవహరించడం సమంజసమేనా? అని ప్రశ్నించారు. వెంటనే పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి ఎస్ఐపై అట్రాసిటీ కేసు నమోదు చేసి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నెన్నెల మండల గుండ్ల సోమారం ఎంపిటిసి దాగం రమేష్, డిసిసి సభ్యులు లవుడియ రమేష్ ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

నవతెలంగాణ - కౌటాల

మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి స్పందన లభించింది. లావణ్య ఫౌండేషన్, యశోద ఆస్పత్రి మలక్‌పేట వారి ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో సుమారు 300 మందికిపైగా రోగులకు బీపీ, షుగర్, ఈసీజీ, టూడీఈకో, రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు పంపిణీ చేశారు. లావణ్య ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్ మాట్లాడుతూ మెడికల్ క్యాంపు విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో పేద ప్రజల కోసం మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ వైద్యశిబిరంలో గుండె సంబంధిత వ్యాధి నిపుణులు డాక్టర్ వెంకటేశ్, ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ రోజ్, స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ శివాని, జనరల్ సర్జన్ డాక్టర్ నూతన్, ఉమా వైద్యమందించారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్

రంజాన్ కానుకల అందజేత

నవతెలంగాణ-అదిలాబాద్ రూరల్



రంజాన్ మాసం నేపథ్యంలో ముస్లీం మైనార్టీలకు సోమవారం మావల మండల కేంద్రంలో జెడ్పీటీసీ నల్ల వనితారాజేశ్వర్ రంజాన్ కానుకలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని మతాలను, కులాలను ఆదరిస్తోందని అన్నారు. అన్ని మతాల వారు తమ పండుగలను గొప్పగా నిర్వహించుకునేందుకు ప్రభుత్వం సహకరిస్తోందని అన్నారు. అందులో భాగంగానే ముస్లిం మైనార్టీల కుటుంబాలకు ప్రతి యేటా రంజాన్ కానుకలను అందజేయడం జరుగుతోందని అన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి కొనసాగుతుందని అన్నారు. కార్యక్రమంలో మావల సర్పంచ్ దొగ్గలి ప్రమీల, నాయకులు దర్శనాల ఏవన్, దొగ్గలి రాజేశ్వర్, అజీమ్, గంగన్న పాల్గొన్నారు.

జాన్సన్ నాయక్‌కు ఘన సన్మానం

నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

ఆత్మీయ పలకరింపులో భాగంగా మండలంలోని బాదనకుర్తి, సుర్జాపూర్, మస్కాపూర్ గ్రామాలలో సోమవారం భూక్య జాన్సన్ నాయక్ పర్యటించారు. పర్యటన సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీకే పట్టం కట్టాలని, కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశపెట్టి అమలుపరుస్తున్న పథకాలను పూర్తిగా ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాల సంతోష్, తుప్ప నరేందర్, బండి బుచ్చగౌడ్, చుక్క రాకేష్, పాంబాల రమేష్, హరీష్, బలగం రమేష్, శనిగారపు గంగారెడ్డి, దేవేందర్, సాకలి రాజన్న, పాదం రాజేశ్వర్, డాక్టర్ గంగారాం, బొమ్మెన ప్రవీణ్, మొగిలి భీమేష్‌లు ఉన్నారు.



రంజాన్ తోఫా కిట్ల పంపిణీ



నవతెలంగాణ-ఖానాపూర్

రంజాన్ తోఫా కిట్లను సోమవారం ఎమ్మెల్యే రేఖా శ్యామ్ నాయక్ పేద మైనార్టీలకు పంపిణీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పేద ముస్లిం కుటుంబాలకు కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ పండుగలను ఆనందంగా నిర్వహించుకోవాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ బతుకమ్మ, క్రిస్మస్, రంజాన్ పండుగలకు పేద ప్రజలకు బట్టలు పంపిణీ చేస్తున్నారని అన్నారు. అంతేకాకుండా ఖానాపూర్ పట్టణంలో ఈద్గా కోసం 2ఎకరాలు కేటాయించటం జరిగిందని అన్నారు. మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల, పట్టణ, ప్రజాప్రతినిదులు, నాయకులు పాల్గొన్నారు.

కడెం : మండల కేంద్రంలో పేద ముస్లిం మహిళలకు రంజాన్ పండుగ బట్టలను ఎమ్మెల్యే అజ్మీరా రేఖ శ్యామ్ నాయక్ సోమవారం ముస్లిం మహిళకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రంజాన్ మాసం సందర్భంగా నిష్ఠతో పాటించే ఉపవాస దీక్షలు, ప్రార్థనలతో సామరస్యం చేసుకోవాలని అన్నారు. పేదల కోసం ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జొన్నల చంద్రశేఖర్ గుప్త, నిర్మల్ జిల్లా జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ రఫీక్, రైతుబంధు సమన్వయ సమితి మండల అధ్యక్షులు నల్ల జీవన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కట్ట శ్యాంసుందర్, ఆత్మ కమిటీ చైర్మెన్ కానురి సతీష్, సర్పంచ్‌లు కొండాపురం అనూష లక్ష్మణ్, జాడి రాజమణి, బానవత్ బేబీ రాజు నాయక్, ముబారక్, రాజేష్, బీఆర్ఎస్ మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉట్నూర్: తెలంగాణ ప్రభుత్వం అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తున్న తరుణంలో రంజాన్ పండుగను పురస్కరించుకొని సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ముస్లీం ప్రజలకు రంజాన్ కానుకలను ఎమ్మెల్యే రేఖా నాయక్ అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అజ్మీరా రేఖ నాయక్ హాజరై మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసాన్ని సందర్భంగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం ప్రతి యేటా పేద ముస్లింలకు కానుకలను అందించడం జరుగుతుందన్నారు. పండుగను ముస్లీం ప్రజలు శాంతియుతంగా ఆనందంగా నిర్వహించుకోవాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటి చైర్మెన్ జాదవ్ శ్రీరాం నాయక్, నాయకులు, ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-గుడిహత్నూర్

ఆదివాసీ సేన తెలంగాణ రాష్ట్ర తృతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఆదివాసీ విద్యార్థి సేన జిల్లా అధ్యక్షుడు కుంరం శత్రుఘన్ అన్నారు. సోమవారం మండలంలోని రాఘవపూర్ పంచాయతీ పరిధిలోని పూనగూడలో మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఈనెల 29, 30 తేదీలలో గుడిహత్నూర్ మండల కేంద్రంలో జరిగే రాష్ట్ర తృతీయ మహాసభలను ఆదివాసులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని అన్నారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీలో 11 కులాలను ఎస్టీ జాబితాలో చేర్చుతూ చేసిన తీర్మానాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోడు భూములను సాగు చేస్తున్న ఆదివాసులకు ఎలాంటి షరతులు లేకుండా పట్టాలివ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ కార్మిక సేన నాయకులు మాడావి లాల్ షావ్, చంద్రకాంత్, అమూల్ మారుతి, పవన్, జంగు, సుంగు, తులసిరాం, శంభు ఉన్నారు.

సీపీఆర్ చేసి రోగి ప్రాణాలు కాపాడిన వైద్యులు

నవతెలంగాణ-భైంసా

భైంసా ఏరియా ఆస్పత్రిలో ముధోల్ మండల కేంద్రానికి చెందిన శోభ(45) తన కూతురిని ఆస్పత్రికి తీసుకువచ్చింది. అయితే శోభ అనే మహిళ అప్పటికప్పుడు అపస్మారక స్థితికి వెళ్లడం, గుండెపోటు రావడంతో వెంటనే అక్కడున్నవారు కేకలు వేయగా, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కాశీనాథ్ కొన్ని క్షణాల్లోనే ఆమె వద్దకు చేరుకొని సీపీఆర్ నిర్వహించడంతో ఆమె ప్రాణాలతో బయటపడింది. ఆమెకు ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్సలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కాశీనాథ్, డాక్టర్ మేఘనను సిబ్బంది సతీష్, రోహిదాస్‌ను అభినందించారు.

నేటి నిరుద్యోగి ధర్నాను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-తాంసి

హలో నిరుద్యోగి చలో ధర్నా చౌక్‌ను 18న హైదరాబాద్‌లోని ధర్నా చౌక్‌లో నిర్వహించే నిరసన దీక్షను విజయవంతం చేయాలని బీఎస్పీ బోథ్ నియోజక వర్గ ఉపాధ్యక్షులు సృజన పాటిల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ బోర్డును ప్రక్షాళన చేయాలని సీఎంకి ఉత్తరాలు రాద్దామని అన్నారు. పేపర్ లీకేజి కేసును సీబీఐకి అప్పగించాలని అన్నారు. పరీక్ష రాసిన విద్యార్థులకు లక్ష రూపాయల పారితోషికాన్ని అందించాలని వీటితో పాటు మరిన్ని డిమాండ్ కోసం దీక్ష చేపట్టడం జరుగుతుందని అన్నారు. నిరుద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభించిన ఎంపీడీఓ

నవతెలంగాణ-లోకేశ్వరం

మండల కేంద్రంలోని రాజురా గ్రామంలో ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ సాల్మన్‌రాజ్ సోమవారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో కూలీలు అందరికీ ఉపాధి హామీ పథకంలో భాగంగా పనులు కల్పిస్తున్నామని అన్నారు. అదేవిధంగా కూలీలు అందరూ సమయపాలన పాటించి పనులు సక్రమంగా చేయాలని తెలిపారు. ఎండాకాలం అయినందున తగిన జాగ్రత్తలు తీసుకొంటూ పనులు చేసుకోవాలని అన్నారు. పని విషయంలో ఎలాంటి అవకతవకలు జరిగిన సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. గ్రామంలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి జాబ్‌కార్డులను అందిస్తామని అన్నారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పనులకు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జగన్, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

22న సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం

నవతెలంగా-ఆదిలాబాద్‌టౌన్

22న అక్షయ తృతీయను పురస్కరించుకోని పట్టణంలోని రాంలీలా మైదానంలో నిర్వహించే సాముహిక హనుమాన్ చాలీసా పారాయణంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని మాధాపూర్ వైష్ణవ సదన్ నారాయణ మహారాజ్ కోరారు. సోమవారం రాంలీలా మైదానంలో హనుమాన్ చాలీసా పారాయణం కోసం చేస్తున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ప్రజలను ఆధ్యాత్మిక వైపు తీసుకెళ్లడం కోసం హనుమాన్ చాలీసా పారాయణ కార్యకమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ నాయకులు గంద్రత్ సంతోష్, మహారాజ్ భక్తులు రాజేశ్వర్ మటోలియా, సంతోష్ ముక్తాపూరే పాల్గొన్నారు.

ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఐకేపీ వీఓఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఐకేపీ వీఓఏ సీఐటీయూ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్, డీఆర్డీఓ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అదనపు కలెక్టర్ నటరాజన్, డీఆర్డీఓ కార్యాలయ ఏపీడీ చరణ్‌దాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ గ్రామస్థాయిలో 17,606 మంది వీఓఏలుగా గ్రామ సంఘ సహాయకులుగా పనిచేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అన్ని రకాల సంక్షేమ పథకాలను సదరు ఉద్యోగులు విజయవంతంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. రాష్ట్రం ఏర్పడి 8 ఏండ్లు దాటిన వీఓఏల బ్రతుకులు మాత్రం మారలేదని ఉద్యోగులు అతి తక్కువ వేతనంతో పనులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి సమస్యలను పరిష్కరించాలని అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోలేదని వాపోయారు. వీఓఏలకు కనీస వేతనం అమలు చేయాలని వారి సమస్యలను పరిష్కరించాలని ఏప్రిల్ 3 నుండి 16వ తేదీ వరకు ఆన్‌లైన్ పనులు బంద్ చేశారని అన్నారు. 17 నుండి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేయాలని ఐకేపీ, వీఓఏల ఉద్యోగ సంఘం సీఐటీయూ రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకే ధర్నా చేపట్టినట్లు వివరించారు. వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రూ.10 లక్షల సాధారణ భీమా, ఆరోగ్య భీమా కల్పించాలని అన్నారు. సెర్ప్ నుండి ఆరోగ్య కార్డులు ఇవ్వాలని వేతనాలను గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతినెల వీఓఏ ఖాతాలో చెల్లించాలని డిమాండ్ చేశారు. జాబ్ చార్టులతో సంబంధం లేని ఇతర పనులు చేయించకూడదని అన్నారు. వీఓఏలపైన మహిళా సంఘాల ఒత్తిడి ఉన్నందున ఎస్‌హెచ్‌జీలకు వీఎల్ఆర్, అభయహస్తం డబ్బులు చెల్లించాలని అన్నారు. ఎస్‌హెచ్‌జీ లైవ్ మీటింగ్‌ను రద్దు చేయాలని అర్హులైన వీఓఏలకు సీసీగా ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీఓఏ సంఘం నాయకులు శ్యామ్‌రావు, భూపతి రాజు, దత్తు, రాజేష్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్

నవతెలంగాణ-నిర్మల్

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. సోమవారం ప్రజాఫిర్యాదు విభాగంలో కలెక్టర్ వరుణ్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లాలో 714 ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికులు పనిచేస్తున్నారని అన్నారు. తొమ్మిది నెలల నుండి కోడిగుడ్ల బిల్లులు, మూడు నెలల నుండి వేతనాలు, బిల్లులు పెండింగ్ ఉన్నాయని అన్నారు. అప్పులు తీసుకొచ్చి విద్యార్థులకు వంట చేసి పెట్టడం జరుగుతుందని అన్నారు. ఇప్పటికైనా పెండింగ్‌లో ఉన్న బిల్లులు, వేతనాలు విడుదల చేసి కార్మికుల కుటుంబాల ఆదుకోవాలని కోరారు. గత ఏడాది మార్చి 15న సీఎం కేసీఆర్ మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.2వేలు వేతనం పెంచుతున్నట్లు ప్రకటించడం జరిగిందిని అన్నారు. జీఓ కూడా ఇవ్వడం జరిగిందన్నారు. కానీ ఇప్పటివరకు అమలు చేయలేదని అన్నారు. వెంటనే పెంచిన రూ. 2 వేలు జీతాలు ఇవ్వాలని అన్నారు. కార్మికులతో ప్రభుత్వం వెట్టి చాకిరి చేయిస్తుందన్నారు. ఈఎస్ఐ, పిఎఫ్, ప్రమాద బీమా, సామాజిక బీమా ఇవ్వాలని అన్నారు. ఉచితంగా గ్యాస్ సరఫరా చేయాలని, నాణ్యమైన బియ్యాన్ని ఇవ్వాలని అన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని అన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హంస, లక్ష్మి, సత్తవ్వ, ప్రభాకర్, కార్మికులు పాల్గొన్నారు.



రెగ్యులరైజేషన్ చేయాలని పంచాయతీ కార్యదర్శుల నిరసన



నవతెలంగాణ-ముథోల్

మండలంలోని ఆయా గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తమను రెగ్యులరైజేషన్ చేయాలని సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను నియమించి నాలుగు సంవత్సరాలు పూర్తవుతున్న నేటికీ ఎటువంటి రెగ్యులరైజేషన్ ఉత్తర్వులు విడుదల చేయకపోవడం అన్యాయమని మండల జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆనంద్‌రావ్, సాయినాథ్ అన్నారు. టీఎఫ్ఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సమ్మె బాట పట్టనున్నట్లు వారు పేర్కొన్నారు. సమ్మె నోటీసు ఇస్తూ15 రోజుల నోటిస్ పిరియడ్ తర్వాత ఏప్రిల్ 28 నుండి నిరవధిక సమ్మెకు వెళ్లనున్నట్టు తెలిపారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యూలర్ చేస్తూ జీఓ విడుదల చేయాలని, గడిచిన నాలుగు సంవత్సరాల ప్రొబిషన్ కాలాన్ని సర్వీసులు కాలంగా గుర్తించాలని అన్నారు. ప్రస్తుతం పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను అందర్నీ జెపీఎస్‌లుగా ప్రమోట్ చేస్తూ పనిచేసిన కాలాన్ని ప్రొబిషన్ పీరియడ్‌లో భాగంగా పరిగణించాలని అన్నారు. మరణించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శులకు ప్రమోషన్ కల్పించాలని 3/7 వల్ల నష్టపోయిన పంచాయితీ కార్యదర్శులకు న్యాయం చేయాలని అన్నారు. పరస్పర బదిలీలు, స్పౌస్ బదిలీలకు అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. ఆనంతరం ఎంపీడీఓ సురేష్‌బాబుకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు అశోక్, పోతన్న, గంగాధర్, భాస్కర్‌గౌడ్, బానుగౌడ్, రాజు కుమార్, అమిత పాల్గొన్నారు.

అమరవీరుల వర్ధంతిని ఘనంగా నిర్వహించుకుంటాం

- తుడుం దెబ్బ నాయకుల పిలుపు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

అమరవీరుల వర్ధంతిని ఘనంగా నిర్వహించుకుంటామని తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పుర్క బాపురావు, మహిళ ప్రధాన కార్యదర్శి పెందూర్ పుష్పరాణి అన్నారు. ఈ సందర్భంగా అమరవీరుల స్థూపం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంద్రవెల్లిలో 1981 ఏప్రిల్ 20న పోలీసుల కాల్పుల్లో అమరుల 42వ వర్ధంతిని ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతుందని అన్నారు. జల్, జమీన్, జంగల్ నినాదంతో ఆదివాసుల హక్కులకోసం నిర్వహించుకుంటున్న శాంతి సమావేశంలో నిప్పు రవ్వలుగా మారి పోలీసులు కాల్పులకు దారితీసిందని అన్నారు. ఈ కాల్పుల్లో పదుల సంఖ్యలో ఆదివాసులు అమరులు కాగా, అనేక మంది గాయాలతో క్షత గాత్రులయ్యారని అన్నారు. ఈ సంఘటన జరిగి 42 ఏండ్లు కావస్తున్న ఆదివాసుల గుండెల్లో మానని గాయంగా చెక్కు చెదరకుండా మిగిలి పోయిందన్నారు. ప్రతి యేటా ఈ అమరవీరులకు వారి సాంప్రదాయ బద్ధంగా నివాళులర్పించే కార్యక్రమం పోలీసుల ఆంక్షల మధ్య జరుగుతోందన్నారు. అయితే ఈ సారి వారి సాంప్రదాయం ప్రకారం స్వేచ్ఛయుత నివాళులర్పిస్తామని పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో తుడుం దెబ్బ జిల్లా కార్యదర్శి సోయం రాందాస్, జుగ్నాక్ భారత్, గెడం భారత్, అర్క ఖమ్ము, కనక తుకారాం పాల్గొన్నారు.



బీఆర్ఎస్ బలగాన్ని చాటిచెప్పేందుకే ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-ఇచ్చోడ

బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తల బలగాన్ని చాటి చెప్పేందుకే తాము ఆత్మీయ సమ్మెళన కార్యకమాలను నిర్వహిస్తున్నామని ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్ అన్నారు. సోమవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని స్థానిక విఠల్‌రెడ్డి గార్డెన్‌లో బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు నాయకత్వంలో, మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సభకు ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి మరో సారి బీఆర్ఎస్ ప్రభుత్వ అఖండ విజయానికి కృషి చేయాలని కార్యకర్తలను కోరారు. ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు మాట్లాడుతూ సభకు విచ్చేసిన అశేష జనవాహినిని చుస్తే సంతోషంగా ఉందని, అప్పుడే గెలుపు ముంగిట్లో ఉన్నట్టుగా ఉందని పేర్కొన్నారు. ఇలాంటి సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడ కూడా లేవని అన్నారు. కార్యకర్తలంతా ఏకమై మరోసారి బీఆర్ఎస్ ప్రభంజనాన్ని రుచి చూపాలని, కార్యక్రమాన్ని భారీ మొత్తంలో విజయవంతం చేసిన నాయకులకు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ దుక్రే సుభాష్ పటేల్, మాజీ కన్వీనర్ మెరాజ్ హమ్మద్, ఆత్మ ఛైర్మెన్ నరాల రవీందర్, బీఆర్ఎస్ అధ్యక్షులు ముస్తఫా, బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్ కుమార్, పార్టి ఉపాధ్యక్షులు సుద్దవార్ వెంకటేష్, బీసీ సెల్ ప్రెసిడెంట్ ఆర్గుల గణేష్, ఎస్సీ సెల్ అధ్యక్షులు గాయికాంబ్లే గణేష్, సోషల్ మీడియా కన్వీనర్ దాసరి భాస్కర్ పాల్గొన్నారు.

జాబ్‌కార్డ్ కల్గిన కూలీలకు పనులు కల్పిస్తాం

నవతెలంగాణ-నార్నూర్

జాబ్ కార్డ్ కల్గిన ప్రతికూలికి ఉపాధి హామీలో భాగంగా పనులు కల్పిస్తామని టీఏ బాపురావ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని క్షేత్ర స్థాయిలో కూలీలు నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులు పరిశీలించారు. పనులు పకడ్బందీగా నిర్వహించాలని ఫీల్డ్ అసిస్టెంట్ కూలీలకు సూచించారు. వారి వెంట ఫీల్డ్ అసిస్టెంట్ సంబాజీ, మెట్‌లు ఉన్నారు.

ముక్రా(కె)కు గ్రామ్ ఊర్జా స్వరాజ్ విశేష్ పంచాయత్ పురస్కార్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇచ్చోడ మండలం ముక్రా(కె) గ్రామపంచాయతీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి సోమవారం ఢిల్లీలో గ్రామ్ ఊర్జా స్వరాజ్ విశేష్ పంచాయత్ పురస్కార్ అవార్డును కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రామీణబివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, సిబ్బంది శ్రావణ్ పాల్గొన్నారు.

అర్జీలను పరిశీలించి చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజావాణిలో అందిన అర్జీలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణిలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి పలు సమస్యలపై వచ్చిన అర్జీదారుల నుండి దరఖాస్తులను శిక్షణ సహాయ కలెక్టర్ పి.శ్రీజతో కలిసి ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భూ సంబంధ సమస్యలను ధరణి పోర్టల్‌లో మీసేవ కేంద్రం ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రజావాణిలో దరఖాస్తుదారులు అందజేసిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఒకే సమస్యపై పలుమార్లు అర్జీదారు ప్రజావాణికి రాకుండా సరైన వివరణ ఇవ్వాలని అన్నారు. ఈ ప్రజావాణిలో భూసంబంధ, ఉపాధి, ఫించన్, వైద్యం, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, తదితర సమస్యలపై అర్జీలు రావడం జరిగిందని తెలిపారు. ఈ ప్రజావాణిలో ఆర్డీఓ రమేష్ రాథోడ్, జెడ్పీ సీఈఓ గణపతి, మున్సిపల్ కమీషనర్ శైలజ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పీఆర్సీ ప్రకటించాలి



నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు రెండో పీఆర్సీ ప్రకటించి 40శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజేష్ నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్‌శాఖ ఉద్యోగులకు ఏడు శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ప్రకటించిన విషయాన్ని దృష్టిలో ఉంచుకొని లక్షలాదిగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు వర్తించేలా పీఆర్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కోడ్ రాకముందే రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీ ప్రకటించే విధంగా రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని అన్నారు. ఈ సమావేశంలో ఆయన వెంట ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడు నెహ్రూ నాయక్, భుక్యా రాము ఉన్నారు.

నేడు జైనథ్‌లో దివ్యాంగుల బస్సు పాస్ కోసం ప్రత్యేక కౌంటర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దివ్యాంగులు బస్ పాస్ కోసం మంగళవారం జైనథ్ మండల కేంద్రంలో ప్రత్యేక మొబైల్ కౌంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆదిలాబాద్ డిపో మేనేజర్ కల్పన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 రుసుము చెల్లించాలని, పాస్‌పోర్ట్ ఫొటో, ఆధార్ కార్డు జిరాక్స్, సదరం సర్టిఫికెట్ తీసుకొని రావాలని తెలిపారు. నూతనంగా దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ తీసుకున్నవారు, గతంలో తీసుకున్న గడువు అయిపోయిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రయివేటు పాఠశాలల ఫీజుల జులుం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫీజుల పేరుతో విద్యార్థులకు వేధిస్తున్నారని అరెల్లి రాజలింగం పేర్కొన్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఓ ప్రయివేట్ పాఠశాలలో తమ ఇద్దరు పిల్లలు కార్తిక్ నర్సరీ, విక్సిత్1వ తరగతిలో చదువుతున్నారు. వీరికి 2022-23 విద్యాసంవత్సరానికి మొత్తం రూ.18వేల 500 ఫీజు చెల్లించాల్సి వుండగా, రూ.15వేలు వరకు చెల్లించాడు. ఇంకను మిగిలిన రూ.3వేల 500 ఫీజు ఏప్రిల్ మాసాంతవులోపు చెల్లిస్తామని యాజమాన్యానికి విన్నవించాడు అయితే సోమవారం విక్సిత్‌కు వార్షిక పరీక్షలు జరుగుతుండగా ఫీజు చెల్లించలేదని పరీక్షకు అనుమతించలేదని పోషకుడు ఆరెల్లి రాజలింగం ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల మొత్తం ఫీజు చెల్లిస్తేనే పరీక్షకు అనుమతిస్తామని యాజమాన్యం భీష్మించుకుకోవడంతో సదరు విద్యార్థి పరీక్షకు దూరమయ్యాడని పోషకుడు కన్నీటి పర్యంతమయ్యాడు. విద్యాశాఖాధికారులు తన పిల్లలకు న్యాయం చేయాలని కోరాడు.

న్యూస్ ఛానల్‌పై చర్యలు తీసుకోవాలి : బీఆర్ఎస్వీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్నపై ఓ న్యూస్ చానల్లో వచ్చిన వార్త కథనాలను తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్వీ నాయకులు శివకుమార్ అన్నారు. ఈ విషయమై సోమవారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి న్యూస్ ఛానల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. రాజకీయ లబ్ధి కోసం ఓ ఎన్నారై తన న్యూస్ ఛానల్‌లో ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఈ సందర్భంగా వారు అన్నారు.

చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



క్యాథనపల్లి మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట సోమవారం మున్సిపల్ చైర్మన్ జంగం కళ చలివేంద్రం ప్రారంభించారు. అనంతరం జంగం కళ మాట్లాడుతూ వేసవి కాలం ఎండలను దృష్టిలో ప్రజలకు చల్లని తాగు నీరు అందుబాటులో ఉంచాలని ఉద్దేశంతో ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ఈ చలివేంద్రాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమములో మున్సిపల్ కమిషనర్ జి. వెంకట నారాయణ, మేనేజర్ కె.నాగరాజు, శానిటరీ ఇన్స్‌పెక్టర్ ఇ. వసంత్, జూనియర్ అసిస్టెంట్ ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా ట్రైనీ కలెక్టర్ గౌతమి

నవతెలంగాణ-భీమిని



ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న గౌతమి ఎంపీడీఓగా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ పోతురాజుల రాజేశ్వరి లక్ష్మణ్ ఆమెను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం కార్యాలయ సిబ్బందితో కలిసి మల్లీడి, వెంకటాపూర్ పంచాయతీలో నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు, క్రీడా మైదానాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో డీఎల్పీఓ పనిందర్‌రావు, ఎంపీఓ సబ్దర్‌అలీ, ఏపీఓ భాస్కర్‌రావు, ఏఓ విజయ్ కుమార్, పీఆర్ ఏఈ రామచందర్, వెటర్నరీ డాక్టర్ సందీప్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

కార్మికుల పనివేళలు మార్పు చేయాలి

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

వేసవికాలంలో కార్మికుల పనివేళలు మార్చాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎండీ అక్బర్ అలీ అన్నారు. సోమవారం ఆర్‌కే ఓసీపీ ఎస్‌సీడబ్ల్యూయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వేసవి కాలంలో కార్మికుల రక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రతల గురించి యాజమాన్యానికి మెమోరాండం అందజేశారు. అనంతరం అక్బర్ అలీ మాట్లాడుతూ వేసవి కాలం దృష్టిలో ఉంచుకుని కార్మికుల పని వేళలు మార్చాలని, కార్మికులకు చల్లని తాగు నీటిని, మజ్జిగ ఓఆర్ఎస్ ప్యాకెట్‌లు అందించాలని కోరారు. వేడి తీవ్రతను తగ్గించేందుకు వాటర్ స్ప్రే చేపించి క్యాంటిన్‌లో మధ్యాహ్నం సమయంలో కార్మికులకు నాణ్యమైన పెరుగన్నం అందించాలని యాజమాన్యంని కోరారు. యాజమాన్యం సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు పెట్టకపోవడం వల్లనే కార్మిక సమస్యలు పరిష్కారం కావడం లేదని వెంటనే సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి ఉపాధ్యక్షుడు ఇప్పకాయల లింగయ్య, ఫిట్ సెక్రటరీ ఎ.ఆంజనేయులు, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ సంపత్, రామకృష్ణ, పూరెళ్ల శ్రీనివాస్, నేదురి తిరుపతి, పి.రాజేశ్వరి పాల్గొన్నారు.

ఉద్యోగాలు రెగ్యులర్ అయ్యేలా చూడాలి

నవతెలంగాణ-జన్నారం

తమ ఉద్యోగాలు రెగ్యులర్ అయ్యేలా చూడాలని ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖా నాయక్‌ను జూనియర్ పంచాయతీ కార్యదర్శులు కోరారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందజేశారు. సందర్భంగా మండల జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ తమకు ఇచ్చిన నాలుగు సంవత్సరాల శిక్షణ కాలం ముగిసిందని, అయినా ప్రభుత్వం పర్మినెంట్ చేయలేదని వారు వాపోయారు. తమను పర్మినెంట్ చేసే విధంగా ప్రభుత్వంతో మాట్లాడాలని ఎమ్మెల్యేను వారు కోరారు. అనంతరం ఎమ్మెల్యే రేఖానాయక్‌ను శాలువాతో సన్మానించారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-భీమిని

భీమిని మండలానికి చెందిన 28 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను సోమవారం ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన ఈ పథకం పేద ప్రజలకు ఎంతో ఆసరాగా నిలుస్తుందన్నారు. ఆడపిల్లల తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బంది పడవద్దనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పోతురాజుల రాజేశ్వరి లక్ష్మణ్, తహసీల్దార్ లక్ష్మీ రాజయ్య, ఏఎంసీ చైర్మన్ నిరంజన్, జడ్పీటీసీ పోతురాజుల గంగక్క బ్రహ్మయ్య, వైస్ ఎంపీపీ చిలుముల మధు, ఏఓ విజయ్, ఏఈఓ మనీషా, ఆర్ఐలు వెంకటేష్, వంశి, సర్పంచులు ఎల్ల గౌడ్, సంతోష్, సురేష్, మండల నాయకులు రమేష్, జైపాల్ సింగ్, ఆరిఫ్, చిన్నన్న పాల్గొన్నారు.

విజయ డెయిరీ పాలను వినియోగించాలి

- ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజలకు అందుబాటు ధరలో ప్రభుత్వ డైరీ అయిన విజయ డైరీ మంచిపాలని ఆ పాలను సద్వినియోగం చేసుకోవాలని ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు. సోమవారం ఆర్డీఓ రాజేశంతో కలిసి విజయ పాలడైరీ ధరల పట్టికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ డైరీ అయిన విజయ పాల డైరీ 10 శాతం వెన్న గల పాలను రూ.80కి లీటర్ అందజేస్తోందని తెలిపారు. విజయ డైరీ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా ముద్ర రుణాలు ఇచ్చేందుకు ఒప్పందం జరిగిందని, త్వరలోనే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్లతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం రోజుకు 2 వేల లీటర్ల పాల సేకరణ జరుగుతుందని, ఈ లక్ష్యాన్ని 5 వేల లీటర్ల వరకు పెంచి దళిత బంధు క్రింద పాడి పరిశ్రమను ఎంచుకున్న రైతులకు ప్రయోజనం చేకూరే విధంగా లక్ష్యాన్ని నిర్దేశించడం జరుగుతుందని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విజయ డైరీ డిడి మధుసూదన్, ఎల్డిఎం హనుమంతరావు పాల్గొన్నారు.

పర్యావరణ అనుమతుల కోసం మంత్రితో భేటీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని పలు రహదారులకు అటవీ పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కోరుతూ మంత్రి ఐకే రెడ్డి, పీసీసీఎఫ్ డోబ్రియల్‌తో ఎమ్మెల్సీ దండేవిటల్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు రాష్ట్ర రాజధాని హైదరాబాదులోని అరణ్య భవనంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని అనేక రహదారులు పర్యావరణ అనుమతులు లేక ఆగిపోయాయని వాటికి వెంటనే అనుమతులు ఇవ్వాలని కోరారు. మంత్రి స్పందిస్తూ త్వరలోనే అనుమతులు వచ్చేలా చూస్తామని చెప్పినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ పాల్గొన్నారు.

బెదిరింపులతో యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-లక్షెట్టిపేట్

మున్సిపాలిటీ పరిధిలోని మోదెల శివారులోని టేకుచెట్ల వద్ద దుడ్డంగుల అనీల్ (22)అనే యువకుడు బీర్‌లో విషం కలుపుకుని తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై లక్ష్మణ్ సోమవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం, తన వరుసకు మేనమామ అయిన గూడెం గ్రామానికి చెందిన దారంగుల రాజమౌళి అనే వ్యక్తి తన కూతురుని ప్రేమిస్తున్నాడని కక్ష కట్టి అనిల్‌ను తీసుకువెళ్లి కొద్ది రోజుల క్రితం బెదిరించాడన్నారు. తనను బెదిరించడంతో పాయిజన్ కల్పిన బీరు అనిల్ తాగి చనిపోయాడని తెలిపారు. మృతుని తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు రాజమౌళిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పార్ట్‌టైం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన ఆశ్రమ పాఠశాల హాస్టల్‌లో పనిచేస్తున్న రోజువారి వర్కర్లు, పార్ట్ టైం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని హాస్టల్స్ డైలీ వైస్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టేకం ప్రభాకర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని డీటీడీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించిన అనంతరం జిల్లా గిరిజన అభివృద్ధి అధికారిని మణెమ్మకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలో ఉన్న గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో, హాస్టల్‌లలో పనిచేస్తున్న డైలీవేజ్ వర్కర్స్, పార్ట్ టైం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని అన్నారు. జీఓ 16ను సవరించి దానిలో డైలీవేజ్ అనే పదం చేర్చాలన్నారు. జీవో 212ను సవరించి 5 సంవత్సరాలు సర్వీస్ వున్న వారందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కమీషనర్ 2017లో ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం 10 సంవత్సరాల సర్వీస్ ఉన్న వారికి వెంటనే అపాయింట్మెంట్ ఆర్డర్స్ ఇవ్వాలన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పోస్టులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలను వెంటనే మంజూరు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సర్క్యులర్ ప్రకారం మిగతా విభాగాలలో చెల్లించిన విధంగా గిరిజన సంక్షేమ శాఖలోని డైలీవేజ్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు కూడా లాక్ డౌన్ కాలానికి పూర్తి వేతనాలు చెల్లించాలన్నారు. గుర్తింపు కార్డులు, యూనిఫామ్ ఇవ్వాలని, వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలన్నారు. జాబ్ చార్టు రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు వెలిశాల క్రిష్ణమాచారి, రాజేందర్, గిరిజన ఆశ్రమ పాఠశాలల, హాస్టల్స్ డైలీవేజ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కోటయ్య, గ్రామ పంచాయతీ జిల్లా ప్రధానకార్యదర్శి పెరక శ్రీకాంత్, నాయకులు రాంబాయి, శశికళ, రాధాబాయి, ప్రమీల, గనేష్, శివరాం, కేశవ్, జంగూ, లక్ష్మీ దివ్య పాల్గొన్నారు.

సీపీఐ ప్రజాపోరు యాత్ర పోస్టర్ల విడుదల



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

ఇంటిఇంటికి సీపీఐ ప్రజాపోరు యాత్ర వాల్ పోస్టర్లను సోమవారం పట్టణంలోని స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ హాజరై మాట్లాడారు. ఈ నెల 18న బెల్లంపల్లి నియోజకవర్గంలోని తాండూరు ఐబీలో సాయంత్రం 4 గంటలకు ప్రజాపోరు యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ యాత్ర ప్రారంభానికి సీపీఐ జాతీయ కార్యదర్శి డా.కె నారాయణ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్, ముఖ్య అతిథిలుగా హాజరై, బారీ ప్రదర్శనతో తాండూర్‌లోని సీపీఐ భగత్‌సింగ్ కార్యాలయం ఎదుట బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. ఈ సభలో జిల్లా సమగ్ర అభివృద్ధి కొరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సింగరేణి బొగ్గు బ్లాకుల ప్రయివేటీ కరణ ఆపాలి, నూతన బొగ్గు గనుల ప్రారంభించాలని, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, తదితర అంశాలపై ఈ పోరు యాత్ర కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి సీపీఐ ప్రజా సంఘాల శ్రేణులు, కార్మికులు, కర్షకులు, మేధావులు, పార్టీ సానుభూతి పరులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి మిట్ట పెల్లి శ్రీనివాస్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఇప్పకాయల లింగయ్య, సీపీఐ జిల్లా సమితి సభ్యులు వనం సత్యనారాయణ, నక్క వెంకటస్వామి, డిహెచ్‌పీఎస్ నాయకులు మారపెల్లి రవి, ఎఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి కట్ల రమేశ్, గోవిందుల రమేష్, ముక్కెర రమేష్ పాల్గొన్నారు.

కాసిపేట : కాసి పేట మండలంలోని కోమటిచేను గ్రామంలో సోమవారం ఈ నెల 18న సీపీఐ ఆధ్వర్యంలో తాండూర్‌లో ప్రారంభించే 'బీజేపీ కో హఠావ్ దేశ్ కో బచావ్' ప్రజా పోరు యాత్ర పోస్టర్లను సోమవారం ఆ పార్టీ నాయకులు విడుదల చేశారు. 18న సాయంత్రం 4 గంటలకు తాండూర్ పెట్రోల్ బంక్ నుంచి ఐబీ చౌరస్తా వరకు ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని, భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి దాగం మల్లేశ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు దాడి గట్టయ్య దాసరపు సత్తయ్య, జాడి పోశం, గట్టు సర్వేశం, దాగం రాజలింగు, బండారి సత్తయ్య పాల్గొన్నారు.

భూములు కబ్జా అవుతున్న పట్టించుకోరా..?

- గ్రామాల్లో తాగునీటి సమస్యపై చర్యలేవి
- సర్వసభ్య సమావేశంలో అధికారులపై ఆగ్రహం

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కడెం ప్రాజెక్టు ప్రధాన కాలువ ఇరు వైపులా ఇరిగేషన్ భూములు కబ్జాకు గురవుతున్న ఆ శాఖ అధికారులు పట్టించుకోరా.. అని జన్నారం ఎంపీటీసీ వడంలేదను, జన్నారం ఎంపీటీసీ మహ్మద్ రియాజొద్దీన్ కోఆప్షన్ సభ్యులు ఇరిగేషన్ జేఈ రాజుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశం మందిరంలో ఎంపీపీ మాదాడి సరోజన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించగా ఎమ్మెల్యే రేఖానాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాల్వకు ఇరువైపులా దాదాపు 50 నుంచి 60 ఎకరాల ఇరిగేషన్ భూమి 20 ఎకరాలు అవుతుందని దాన్ని అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కాల్వ ఇరిగేషన్ భూమిలో బిల్డింగులు గడ్డి గడ్డివాములు పెట్టుకుంటున్నారన్నారు. వాటిని స్వాధీనం చేసుకోవాలని ఇరిగేషన్ అధికారులను డిమాండ్ చేశారు. దీనికి స్పందించిన జేఈ 15 రోజుల్లో ఆ భూములను స్వాధీనం చేసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే మండలంలోని మందపల్లి గ్రామపంచాయతీ గొండుగుడలో తాగు నీటి సమస్య తీవ్రంగా ఉందని, ఆ గ్రామ ఎంపీటీసీ దాముఖ మమత, సర్పంచ్ ఆశారాజ్‌లు ఆర్డబ్ల్యూఎస్ జేఈ శ్రావ్యాను నిలదీశారు. త్వరలో సమస్యను పరిష్కరిస్తామన్నారు. గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు అలంకారప్రాయంగా మారాయని ఎక్కడ కూడా క్రీడా ప్రాంగణాలు ప్రజలకు ఉపయోగపడడం లేదని వైస్ ఎంపీపీ సుతార్ వినయ్ కుమార్ అధికారుల నిలదీశారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో అధికారులు పూర్తిగా విఫలం చెందుతుందన్నారు. గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డులు, స్మశానవాటికల నిర్వహణ సక్రమంగా లేదన్నారు. వీటిని ప్రజలు వినియోగించుకోవడంలో అధికారులు అవగాహన కల్పించకపోవడమే ఇందుకు నిదర్శనం అన్నారు. అన్ని శాఖల



అధికారులు వారి నివేదికలను చదివి వినిపించారు.

కవ్వాల్ టైగర్ జోన్ లోకి భారీ వాహనాలను అనుమతించాలి

కవ్వాల్ టైగర్ జోన్ లోకి భారీ వాహనాలతో సహా లారీలు ఇతర వాహనాలను అనుమతించాలని సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే రేఖా నాయక్, మందపల్లి సర్పంచ్ నెమలికొండ ఆశరాజు వినతి పత్రానందించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఈ సమస్యను పరిష్కరించాలన్నారు. జంతువులకు ఇబ్బంది కలగకుండా అటవీ శాఖ అధికారులే అడవి చుట్టూ కంచెలు నిర్మించుకోవాలి కానీ వాహనాలు రాకుండా చేయడం సబబు కాదని ఎమ్మెల్యేను కోరారు. ఈ సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే రేఖా నాయక్ హామీ ఇచ్చారు. సమావేశంలో ఎంపీడీఓ అరుణ రాణి ఈఓపీఆర్డి రమేష్, డిప్యూటీ తహసీల్దార్ మనోహర్‌రావు, ఎంఈఓ విజయ్ కుమార్, ఐసీడీఎస్ సీడీపీఓ రేష్మ, మండల పశువైద్యాధికారి డాక్టర్ కస్తూరి శ్రీకాంత్, ఏఈఓ అక్రమ్, ఏపీఓ రవీందర్ ,ఏపీఎం బుచ్చన్న పాల్గొన్నారు.

ధ్యానం, ప్రాణాయామంతో ఆరోగ్యం మెరుగు



నవతెలంగాణ-నస్పూర్

యోగ ధ్యానం, ప్రాణాయామం, ముద్రలు ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తాయని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి అన్నారు. సోమవారం హార్ట్ ఫుల్ నెస్ ఇనిస్టిట్యూట్ రామచంద్రమిషన్, సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, సింగరేణి ఆధ్వర్యంలో స్థానిక సింగరేణి ఆఫీసర్స్ క్లబ్ సీసీసీ టౌన్ షిప్‌లో అజాది కా అమత్ మహోత్సవ్‌లో భాగంగా 'హర్ థిల్ ధ్యాన్ హర్ థిన్ ధ్యాన్' యోగ మహోత్సవ్ ముగింపు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సేవా అధ్యక్షురాలు రాధా కుమారితో కలిసి జీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థూలకాయం షుగర్ వ్యాధి, బీపీ నియంత్రణకు సంబంధించిన యోగాసనాలు వేయడం జరిగిందని తెలిపారు. బ్రైటర్ మైండ్స్ విద్యార్థులు ప్రదర్శించిన మెదడుకు, కళ్లకు సంబంధించిన వ్యాయామాలు కళ్లకు గంతలు కట్టుకుని వివిధ రకాల రంగులను గుర్తించడం, పేపర్ మీద రాసిన పదాలు, వాక్యాలను స్పర్శ, వాసనతో గుర్తుపట్టడం అద్భుతమన్నారు. ఈ శిక్షణ పొందిన పిల్లలు మేధో అభివృద్ధి, శారీరక అభివృద్ధి, ఆధ్యాత్మిక అభివృద్ధి సంబంధించి అంశాలు నేర్పిస్తూ మెదడులో ఉన్న రెండు భాగాలను అభివృద్ధి చేస్తూ 5 నుండి 15 సంవత్సరాల మధ్య ఉన్న పిల్లలకు ఈ శిక్షణ అందివ్వడం చాలా సంతోషకరమైన విషయమని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉపాధ్యక్షులు కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, ఏరియా ఇంజనీర్ రమేష్ బాబు, శ్రీరాంపూర్ ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ పురుషోత్తమరెడ్డి పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ చేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయావరణలో ముస్లింలకు సోమవారం స్థానిక ఎమ్మెల్యే రేఖానాయక్ రంజాన్ తోఫాను అందజేశారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిందన్నారు. షాది ముబారక్ ప్రవేశపెట్టి ముస్లింలకు అండగా నిలుస్తున్న ప్రభుత్వం బీఆర్ఎస్ అన్నారు. ముస్లిం సోదరులు ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మాదాడి సరోజన వైస్ ఎంపీపీ సుతార్ వినయ్ కుమార్, పార్టీ ప్రధాన కార్యదర్శి సులువా జనార్ధన్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మమ్మద్ రియాజుద్దీన్ పాల్గొన్నారు.

కోటపల్లి : మండలంలోని జనగామ సర్పంచ్ గట్టు లక్ష్మణ్‌గౌడ్ సోమవారం గ్రామంలోని మైనారిటీ కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు గరిబ్ ఖాన్, మాజీ సర్పంచ్ అల్లూరి చంద్రయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అడ్డురి సమ్మయ్య అమీర్‌ఖాన్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : ప్రభుత్వం రంజాన్ సందర్భంగా మైనార్టీలకు అందిస్తున్న తోఫాను జిల్లా కేంద్రంలో పలుచోట్ల లబ్దిదారులకు అందజేశారు. ఉస్మానియా కాలనీలో మైనారిటీ నాయకులు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా మస్జిద్ అధ్యక్షుడు అహ్మద్ బిన్ అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శి తారిక్, సభ్యులు అఫ్సర్, తాహెర్ , ఇర్ఫాన్ పాల్గొన్నారు. పట్టణంలోనీ హడ్కోకాలనీలో సోమవారం మైనారిటీ నాయకులు సీఎం కేసీఆర్ రంజాన్ పండుగ కానుక (బట్టలు) పంపిణీ చేశారు. కార్యక్రమంలో జమా మస్జిద్ అధ్యక్షుడు అబ్దుల్ ఫాయాజ్, మైనారిటీ నాయకులు అబ్దుల్ రహమాన్, సయ్యిద్ నిసార్, హకిం అన్సారీ, సలం, షబ్బీర్, ఎండీ అహ్మద్, ఎండీ తాజ్, నజీర్, ఎండీ ఇమ్రాన్, షాహిద్ హుస్సేన్, సయ్యద్ రహ్మాన్ పాల్గొన్నారు.

సైన్స్‌ఫేర్‌లో పాల్గొన్న విద్యార్థినికి సన్మానం



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

రాష్ట్రపతి భవన్‌లో ఇటీవల నిర్వహించిన ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్ అండ్ ఇంటర్‌నేనుర్ షిప్-2023(ఫైన్) సైన్స్‌ఫేర్‌లో పాల్గొన్న శ్రీచైతన్య పాఠశాల 8వ తరగతి విద్యార్థిని శ్రీవల్లిని స్థానిక 8వ వార్డు కౌన్సిలర్ శ్రీలత సత్తయ్య సోమవారం ఘనంగా సన్మానించారు. మంచిర్యాల జిల్లా గద్దెరాగడికి చెందిన విద్యార్థిని నాలుగు రోజులపాటు రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన సైన్స్‌ఫేర్‌లో పాల్గొనగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమె అభినందించారు. రూపొందించిన ప్రాజెక్టు తప్పక ఉపయోగపడుతుందని రాష్ట్రపతి అభినందించారని కౌన్సిలర్ తెలిపారు. రాష్ట్రపతితో ప్రశంసలు అందుకున్న శ్రీవల్లిని పలువురు అభినందించారు. కార్యక్రమంలో శ్రావణ్, అరవిందు, సత్యనారాయణరెడ్డి, రాజమల్లు, సంజీవరెడ్డి, సాయికృష్ణ, దినేష్, మనోహర్, శివకుమార్, అనిల్, రవీందర్ పాల్గొన్నారు.

ప్రగతి నివేదిక రూపొందించాలి

- ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాల పురోగతిపై నియోజకవర్గాల వారీగా ప్రగతి నివేదికలు రూపొందించాలని ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి వివిధ శాఖల అధికారులకు సూచించారు. సోమవారం జిల్లాలోని అన్ని శాఖల ఉన్నతాధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2014-15 నుండి 2022-23 వరకు ఆయా ఆర్థిక సంవత్సరాలలో నియోజకవర్గాల వారీగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై నివేదిక రూపొందించాలని, సంబంధిత శాఖల అధికారులు అభివృద్ధి పనుల ఫోటోలతో కూడిన నివేదికలను ఈ నెల 20వ తేదీలోగా సమర్పించాలని ఆదేశించారు. సంక్షేమ శాఖలు 2014 నుంచి 2022 వరకు పూర్తి వివరాలతో సిద్ధంగా ఉండాలని, నిర్ణీత గడువులోగా అన్ని ప్రగతి నివేదికలను సీపీఓ కార్యాలయంలో అందజేయాలని అన్నారు. జిల్లా అభివృద్ధి కోసం అధికారులు నిబద్దతతో పనిచేయాలని, సీఎస్ఆర్ కింద విడుదలైన నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాలని, సమిష్టి కృషితో జిల్లాను అన్ని రంగాలలో ముందుండేలా కృషి చేయాలని తెలిపారు. సమావేశంలో సీపీఓ రవీందర్, ఆర్డీఓ రాజేశ్వర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నర్సరీ నిర్వహణకు ప్రత్యేక శ్రద్ధ చూపండి

నవతెలంగాణ-తాండూర్

గ్రామ పంచాయతీల్లోని నర్సరీల నిర్వహణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీఓ సత్యనారాయణ సూచించారు. సోమవారం మండలంలోని ద్వారకాపూర్ గ్రామ పంచాయతీ నర్సరీని, పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండాకాలం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో మొక్కల ఎదుగుదలకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రోజుకు రెండు పూటల నీటిని అందిస్తూ కలుపును ఎప్పటికప్పుడు తీసేయాలన్నారు. వాతావరణ మార్పుల వల్ల పెనుగాలులు సంభవించే అవకాశాలు ఉన్నందున షెడ్ నెట్ పందిళ్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ జాగ్రత్తలు పాటించాలన్నారు. గ్రామపంచాయతీలో బోరు బావులు మిషన్ భగీరథ నీటి సరఫరాను పర్యవేక్షించాలని సూచించారు. ఉపాధి హామీలో నిర్మించిన నీటి తొట్లను ఉపయోగించి పశువులకు నీటిని అందించాలని తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని సూచించారు.

భూ నిర్వాసితులను నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం

నవతెలంగాణ-కాసిపేట

కల్యాణిఖని ఓపెన్ కాస్ట్ మైనింగ్ వల్ల కాసిపేట మండలం దుబ్బగూడెం గ్రామం కాలగర్భంలో కలిసిపోనుండగా అక్కడి భూనిర్వాసితులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఎంవి.గుణ పేర్కొన్నారు. సోమవారం కాసిపేట మండలం దుబ్బగూడెంలో పర్యటించారు. అనంతరం మాట్లాడుతూ ఓసీలో బ్లాస్టింగ్ వల్ల దాదాపు ప్రతి ఇంటికి పగుళ్ళు వచ్చాయని, ఎప్పుడు కూలిపోతాయో తెలియని, పెద్దనపెల్లి శివారులో లేవుట్ చేసినా ఎవరి ప్లాట్ వాళ్ళకి అలాట్ చేయకపోవడంతో అక్కడికి వెళ్ళలేని పరిస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కన్వీనర్ బొడ్డు వినోద, బెల్లంపల్లి నియోజకవర్గం ఇన్‌ఛార్జి వరప్రసాద్ పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
మంగళవారం 18 ఏప్రిల్ 2023

ఎండల నుండి జాగ్రత్త : తహసీల్దార్ సరిత

నవతెలంగాణ-లోకేశ్వరం



మండల ప్రజలు వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సోమవారం తహసీల్దార్ సరిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రానున్న రెండు నెలల పాటు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. అత్యధికంగా మండల ప్రజలు ఉదయం 11:30 గంటల వరకు తమ పనులు ముగించుకొని ఇండ్లలో వుండి మిగిలిన పనులు సాయంత్రం 4:30 గంటల తరువాత చేసుకోవాలని, బయటకు వెళ్లేటప్పుడు తప్పకుండా క్యాపు, స్కార్ఫ్ లాంటివి తలని కప్పుకొనెలా ధరించాలని, ఎక్కువ మోతాదులో నీరు తాగలని సూచించారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట నేరస్తుడి హల్‌చల్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలో టూటౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట పాత నేరస్థుడు మోయిజ్ హల్ చల్ చేశాడు. పోలీసులు తనను తరచూ వేధిస్తున్నారని సోమవారం మధ్యాహ్నం సమయంలో పోలీస్‌స్టేషన్ ఎదుట అర్ధనగ్నంగా ఆందోళన చేశాడు. మోహిజ్ పోలీస్ స్టేషన్ బోర్డుపై రాళ్లు రువ్వడంతో పాటు బ్లేడుతో చేయిని కోసుకుంటూ హల్‌చల్ చేయడంతో ఒక్కసారిగా స్టేషన్ ఎదుట ఆందోళన నెలకొంది. పోలీసులు మోహిజ్ ను పట్టుకునేందుకు ప్రయత్నించగా తన వెంట తెచ్చుకున్న పెట్రోల్ బాటిల్‌తో బెదిరించడంతో కొంత ఉద్రిక్తత నెలకొంది. ఎట్టకేలకు పోలీసులు మోహిజ్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. కాగా ఈ నేరస్థుడు చోరీ కేసులో పది రోజుల క్రితమే జైలు నుండి విడుదలయ్యాడని, గతంలోను జైలులో ఇలాంటి ఘటనలు జరిగినట్టు పోలీసులు తెలిపారు.

రాష్ట్రస్థాయిలో గురుకుల గిరిజన విద్యార్థి ప్రతిభ



నవతెలంగాణ-ఉట్నూర్

రాష్ట్ర స్థాయిలో ఇటీవల నిర్వహించిన గిరిజన బాలికల అర్చరీ క్రీడా పోటీలలో స్థానిక గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థి ప్రతిభ చాటింది. ఈ మేరకు సోమవారం స్థానిక గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హరిత, సిబ్బంది విద్యార్థి ప్రియాంకను సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గత నెలలో 19న గోల్కొండలోని ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ అథ్లెటిక్స్ పోటీలలో ప్రతిభ కనబరిచి సిల్వర్ మెడల్ సాధించిందన్నారు. అంతకుముందు మార్చి నెలలోనే 16న జరిగిన పోటీలలో ప్రతిభ కనబరిచిందన్నారు. ఇలాంటి పోటీలలో పాల్గొని మరిన్ని మెడల్స్ సాధించి, అందరి మన్ననలు పొంది ఉన్నత స్థానంలో నిలువాలని అన్నారు. విద్యార్థిని సన్మానించిన వారిలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

పనులపై సమీక్షా సమావేశం

నవతెలంగాణ - వాంకిడి

ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించామని ఎంపీఓ శివకుమార్ తెలిపారు. సమావేశంలో మండలంలో నిర్వహిస్తున్న సానిటేషన్, నర్సరీ తదితర వాటిపై చర్చించారు. అనంతరం ఎంపీఓ మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించాల్సిన బాధ్యత ప్రతి అధికారిపై ఉందన్నారు. అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-లోకేశ్వరం

బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ఈనెల 21న లోకేశ్వరం మండల కేంద్రంలో నిర్వహించే ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని మండల ప్రజలు విజయవంతం చేయాలని ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ చైర్మెన్ లోలం శ్యాంసుందర్ అన్నారు. సోమవారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంపై పార్టీ శ్రేణులతో చర్చించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల నుండి అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చేట్లు ఏర్పాటు చేయాలని నాయకులకు సూచించారు.

నేడు ఎమ్మెల్యే రేఖానాయక్ రాక

నవతెలంగాణ-సిరికొండ

నేడు మండలానికి ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ వస్తున్నారని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు షేక్ బషీర్ తెలిపారు. మండలంలోని కొండాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. మండలంలోని పార్టీ కార్యకర్తలంతా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నూతన మార్కెట్ కమిటీ చైర్మెన్‌కు సన్మానం

నవతెలంగాణ-లోకేశ్వరం

లోకేశ్వరం మండలానికి చెందిన రాజేష్‌బాబు భైంసా మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా ఎన్నికయ్యారు. దీంతో సోమవారం మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు పుస్పూర్ గ్రామంలో శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజేష్‌బాబు మాట్లాడుతూ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి తనపైన నమ్మకం ఉంచి పదవికి ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మెన్ లోలం శ్యాంసుందర్, ఎంపీపీ లలిత భోజన్న, పీఏసీఎస్ చైర్మెన్ రత్నాకర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు కరిపే సుందర్, బండి ప్రశాంత్, సర్పంచ్‌ల సంఘం జిల్లా కార్యదర్శి భుజాంగ్‌రావు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నూతన జీఎంను కలిసిన సీఐటీయూ నాయకులు



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మోహన్‌రెడ్డిని సోమవారం సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియు) నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఏరియాలో పెండింగ్ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. మందమర్రి ఏరియాలోని అన్ని గనులపై ఉన్న పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని జీఎంను కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ డిప్యూటీ జనరల్ సెక్రటరీ నాగరాజు గోపాల్, మందమర్రి బ్రాంచ్ అధ్యక్షులు వెంకటస్వామి, కార్యదర్శి అల్లి రాజేందర్, వివిధ గనుల పిట్ సెక్రటరీలు వెంకటేష్, భరత్, రాయమల్లు, సీనియర్ ఏరియా నాయకులు ఐలయ్య, సంజీవ్, వెంకటేష్, చైతన్యరెడ్డి, ఆరిఫ్, అన్వేష్, శుభేష్ పాల్గొన్నారు.

బాసరలో ఐపీఎల్ బెట్టింగ్ కలకలం

- ఒకరిని అదుపులోకి తీసుకున్న ఎస్ఓటీ ఫోర్స్

నవతెలంగాణ-బాసర

నిర్మల్ జిల్లా బాసరలో ఐపీఎల్ బెట్టింగ్ కలకలం రేపింది. ఐపీఎల్ బెట్టింగ్‌లో పాలుపంచుకున్న మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ధర్మాబాద్ పట్టణానికి చెందిన ఒకరిని బాసర రైల్వే స్టేషన్ వద్ద ఎస్ఓటీ ఫోర్స్ ఒకరిని అదుపులోకి తీసుకున్న సంఘటన ఆలస్యంగా సోమవారం వెలుగులోకి వచ్చింది. ఈ విషయమై ఎస్సై మహేష్‌ను వివరణ కోరగా స్పెషల్ ఆపరేషన్ టీం ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ధర్మాబాద్ పట్టణం కేంద్రంగా ఐపీఎల్ బెట్టింగ్ జోరుగా సాగుతుందని వార్తలు గుప్పుమంటున్నాయి. ఆన్‌లైన్ ద్వారానే ఈ ఐపీఎల్ బెట్టింగ్ కొనసాగుతుందని పలువురు పేర్కొంటున్నారు.

సమస్యలు పరిష్కరించే వరకూ నిరసనలు

- జూనియర్ పంచాయతీ కార్యదర్శులు



నవతెలంగాణ - సిర్పూర్(టి)

రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ పంచాయతీ, అవుట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తోందని, సమస్యలు పరిష్కరించే వరకూ నిరసనలు తెలుపుతామని పేర్కొన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రిక్రూట్‌మెంట్ సమయంలో మూడేండ్ల ప్రొబేషనరీ పీరియడ్ విధించిందన్నారు. తర్వాత ఏడాది పొడిగించిందన్నారు. అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శులను, అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న కార్యదర్శులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. నాలుగేండ్లు పూర్తి కావస్తున్నప్పటికీ సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఈ నెల 28 ఉండి నిరవధిక సమ్మెకు దిగుతామని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శులు ప్రవీణ్, హరీష్, మౌనిక, సుజాత, రోజీమేరి పాల్గొన్నారు.

వాంకిడి : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్యదర్శులు సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ముందు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తమను జేపీఎస్‌లు గుర్తించాలని డిమాండ్ చేశారు.

కౌటాల : మండలంలో ఓపీఎస్‌గా విధులు నిర్వర్తిస్తున్న గ్రామ పంచాయతీ కార్యదర్శులను జేపీఎస్‌లుగా ప్రమోట్ చేయాలని సోమవారం నల్లబ్యాడ్జీలతో ఎంపీడీఓ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. అనంతరం జేపీఎస్‌లుగా గుర్తించాలని సమ్మె నోటీసును ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్‌కు, ఎంపీడీఓ నస్రుల్లాఖాన్‌కు అందజేశారు. ప్రభుత్వం స్పందించి తమను జేపీఎస్‌లుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

వేతనాలు చెల్లించాలని రాస్తారోకో



నవతెలంగాణ - బెజ్జూర్

గ్రామ పంచాయితీ పారిశుధ్య కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ సోమవారం ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఎండను సైతం లెక్కచేయకుండా సుమారు రెండు గంటల పాటు రోడ్డుపై బైటాయించి తమ నిరసనను వ్యక్తం చేశారు. నాలుగు నెలలు గడుస్తున్నా తమకు వేతనాలు అందించడంలో గ్రామ పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని, తమ గోడు ఎవరికి చెప్పుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే డీఎల్‌పీఓ, సర్పంచ్, ఎంపీడీఓ తమ వద్దకు వచ్చి తమకు స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండు గంటల పాటు రోడ్డుపై బైటాయించడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో కార్యదర్శి తుకారాం, ఉప సర్పంచ్ రాజేష్ నిరసన వ్యక్తం చేస్తున్న పారిశుధ్య కార్మికుల వద్దకు వెళ్లి వారితో మాట్లాడారు. సాంకేతిక లోపం కారణంగా డిజిటల్ కీ లేనందున వేతనాలు అందించడంలో ఆలస్యమవుతోందని, డిజిటల్ కీ రాగానే వేతనాలు చెల్లిస్తామని, రోడ్డుపై నుండి లేవాలని కోరారు. నాలుగు నెలల నుండి వేతనాలు లేక అరిగోస పడుతున్నామని, తమను ఎవరూ పట్టించుకోవడంలేదని, తమకు స్పష్టమైన హామీ ఇస్తేనే రోడ్డుపై నుండి లేస్తామన్నారు. దీంతో 15 రోజుల్లో నాలుగు నెలల వేతనాలను చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు రాస్తారోకో విరమించారు. వీరికి బీఎస్‌పీ నాయకుడు సల్మాన్, మోహన్ మద్దతు తెలిపి రాస్తారోకోలో బైటాయించారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

నవతెలంగాణ-ఇచ్చోడ

అంతరాష్ట్ర దొంగల ముఠాను సెల్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా అరెస్టు చేసినట్లు ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్‌గౌడ్ తెలిపారు. సోమవారం మండల కేంద్ర పోలీస్‌స్టేషన్లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. హర్యాన రాష్ట్రానికి చెందిన ఆరుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి గ్రామం నుండి ఎ-1, ఎ-2లు ఫిర్యాదుదారుని వద్ద నుండి జెసిబి లీజుకు తీసుకొని వచ్చి మండలంలోని ఇస్లాంనగర్ గ్రామంలో పనులు చేశారు. ఫిబ్రవరి 28న జెసిబిని మోసపూరితంగా దొంగలించి అమ్మేయాలనే ఉద్దేశంతో నడుపుకుంటూ మహారాష్ట్రలోని పాండ్రకవడ వరకు తీసుకెళ్లారు. ఫోన్లను స్విచ్ ఆఫ్ చేసుకుని అక్కడ జెసిబిని నడుపుకుంటూ వచ్చిన డబ్బులతో జల్సాలు చేశారు. జెసిబిని అమ్మేయాలనే ప్రయత్నంలో ఉండగా ఎ-1ను నిర్మల్ బైపాస్ వద్ద పట్టుకొని విచారించారు. నేరం ఒప్పుకొని ఎ-4, జెసిబి ఆచూకీ తెలిపాడు. ఎ-1, ఎ-4ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. డీఎస్పీ వెంట సీఐ నైలు నాయక్, ఎస్సై శ్రీకాంత్ ఉన్నారు.



కాంట్రాక్టు కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి కాంట్రాక్టు కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో డీజీఎం(సివిల్) సతీష్‌బాబుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ మాట్లాడుతూ సింగరేణి కార్మికులకు ప్రతినెల 10వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని, కాని అధికారుల నిర్లక్ష్యం కారణంగా చెల్లించడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించడంలో యాజమాన్యం విఫలమైందన్నారు. యాజమాన్యానికి బొగ్గు ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ కార్మికుల సంక్షేమంపై లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న సీఎంపీఎఫ్ చిట్టీలు ఇవ్వాలని, ఈ నెల 18, 19వ తేదీల్లో జరిగే జేబీసీసీఐ సమావేశంలో కాంట్రాక్టు కార్మికుల హైపర్ కమిటీ వేతనాల కోసం చర్చించి 2013 నుండి రావాల్సిన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల కార్మికుల పని వేళలు మార్చాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులకు కూడా ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లు వెంటనే ఇవ్వాలని, కార్మికులకు, వారి కుటుంబ సభ్యులందరికీ కార్పొరేట్ వైద్య సదుపాయం కల్పించాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు రాజన్న, శోభన్, మహేందర్, పోచయ్య పాల్గొన్నారు.

నిజాయితీని చాటుకున్న ఆసిఫాబాద్ ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్

నవతెలంగాణ-బెజ్జూర్



ప్రయాణికుడు బస్సులో మరిచిపోయిన డబ్బులను పోలీస్‌స్టేషన్‌లో అందజేసి ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్ నిజాయితీని చాటుకున్నారు. సోమవారం కాగజ్‌నగర్ నుండి బెజ్జూర్‌కు వస్తున్న ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడు తాళ్లపల్లి చంద్రయ్య తన పర్సును బస్సులోనే పోగొట్టుకున్నాడు. ఆసిఫాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ ప్రభాకర్, కండక్టర్ మహేశ్వర్ గమనించి, బెజ్జూర్ పోలీస్‌స్టేషన్‌లో రూ.1890తో పాటు ఏటీఎం కార్డును ఎస్సై మోహన్‌కు అందజేశారు. నిజాయితీని చాటుకొని ప్రయాణికుడికి డబ్బులు పోలీస్‌స్టేషన్‌లో ఇవ్వడంతో డ్రైవర్, కండక్టర్‌ను పలువురు అభినందించారు.

రన్నింగ్‌లో బంగారు పతకం సాధించిన వెటర్నరీ దంపతులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

హైదరాబాద్‌లో నిర్వహించిన వెటర్నరి పరుగు పందెంలో మండలంలోని బూరుగూడకు చెందిన ఆనందరావు శకుంతల దంపతులు బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ ఆదివారం హైదరాబాద్‌లో సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వెటర్నరీ అథ్లెటిక్ రన్నింగ్ 3 కెఎంలో ప్రథమ బహుమతి సాధించినట్లు తెలిపారు. 1500 మీటర్ రన్నింగ్ విభాగంలో శకుంతల బంగారు పతకం, తాను కాంస్య పతకం సాధించానని, వాకింగ్ మూడు కిలోమీటర్ల విభాగంలో బంగారు పతకం సాధించినట్లు తెలిపారు. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఈ దంపతులు జాతీయస్థాయి పోటీల్లో రాణించారు.

ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-సారంగాపూర్



జాబ్ కార్డు కలిగిన ప్రతిఒక్కరూ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సుజాత నర్సిరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అటవీ ప్రాంతం ఉపాధి హామీ పథకం పనులను ప్రారంభించి మాట్లాడారు. పేదలకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టిందని అన్నారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ 100 రోజుల పనిని పూర్తి చేసి ఉపాధి పొందాలని అన్నారు. పని ప్రదేశానికి తాగు నీరు తెచ్చుకోవాలని, ఎండ కాకముందే పనులు పూర్తి చేసి ఇంటి చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ ముత్యం, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్, కూలీలు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించకుంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం

నవతెలంగాణ-బెజ్జూర్

మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులకు వేతనాలు 15 రోజుల్లోగా చెల్లించకపోతే కలెక్టరేట్ ముట్టడిస్తామని బీజేపీ మండలాధ్యక్షుడు జాడి దిగంబర్ హెచ్చరించారు. సోమవారం మండలకేంద్రంలో బీజేపీ పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీజేపీ మండలాధ్యక్షుడు జాడి దిగంబర్ మాట్లాడుతూ 15 రోజుల్లోగా పారిశుధ్య కార్మికుల వేతనాలు ఇవ్వకుంటే మండలంలోని గ్రామపంచాయతీల పారిశుధ్య కార్మికులతో కలిసి కలెక్టరేట్ ముట్టడిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మండల మాజీ ఉపాధ్యక్షుడు తాళ్ల రామయ్య, జిల్లా దళిత మోర్చా అధ్యక్షుడు కుమ్మరి తిరుపతి, మాజీ సర్పంచ్‌లు వసీఉల్లాఖాన్, లింగాల శంకరయ్య, గూడ రాకేష్, మండల ప్రధాన కార్యదర్శులు గురునాథమ్ మురళీగౌడ్, ఉమ్మెర బాలకృష్ణ, తలండి భిక్షపతి, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె



నవతెలంగాణ-ఆసిఫాబాద్

వివోఏల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని సిఐటియు జిల్లా సహాయ రాష్ట్ర కార్యదర్శి రాజేందర్ అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట సోమవారం ఐకెపి వివోఎల సమ్మెను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివోఏలు ప్రభుత్వ పథకాల అమలులో ఎంతగానో పనిచేస్తున్నారని, అయినప్పటికీ గుర్తింపు ఇవ్వడం లేదన్నారు. వివోఏలను వెంటనే సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పిస్తూ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించి, గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతినెల వేతనాలు వ్యక్తిగత ఖాతాలకు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బుద్ధి, కార్యదర్శి రమా, సునీత, వినోద్, గణేష్, కల్పన, శ్రీలత, అర్చన పాల్గొన్నారు.

గ్రామాలను ప్రణాళికతో అభివృద్ధికి చేసుకోవాలి



నవతెలంగాణ-తాంసి

సర్పంచ్‌లు, కార్యదర్శులు తమ గ్రామాలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసుకోవాలని ఎంపిడిఓలు సర్పంచ్‌లకు సూచించారు. సోమవారం తాంసి, భీంపూర్ మండలాలకు చెందిన సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు తాంసి మండలంలోని కప్పర్ల గ్రామ రైతు వేదిక భవనంలో మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవోలు భూమయ్య, శ్రీనివాస్ మాట్లాడుతూ స్వచ్ఛభారత్‌లో భాగంగా తమ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ గ్రామంలో చేపట్టే అభివృద్ధి పనులను ప్రణాళికబద్ధంగా చేసుకోవాలన్నారు. మొదటి స్వచ్ఛభారత్‌లో మిగిలిపోయిన పనులను పూర్తి చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జడ్పిటిసి రాజు, ఎంపిఓలు సుధీర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్సులు, సర్పంచులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా బంద్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలో సోమవారం హిందు వాహిని శాఖ ఆధ్వర్యంలో బంద్ ప్రశాంతగా కొనసాగింది. ఈ బంద్‌లో పలువురు షాపులను స్వచ్ఛందంగా మూసివేయగా పలువురు తెరిచారు. ఈనెల 14న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో జరిగిన ఘర్షణకు శివాజీ మహరాజ్ జెండాను అవమాన పర్చిన ఓ గ్రూప్‌పై మరో గ్రూప్ దాడి చేయడాన్ని నిరసిస్తూ హిందు సంఘాల ఆధ్వర్యంలో బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా ఎక్కడికక్కడ అరెస్ట్ చేశారు. బీజేపీ రాష్ట్ర నాయకురాలు సుహాసిని రెడ్డిని ఉదయన్నే అరెస్ట్ చేసి ఇంటి దగ్గర పోలీసులు మోహరించారు. అటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ నాయకులు కలిసి బంద్‌ను చేయించడానికి పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వైపు ర్యాలీగా వెళ్లగా పోలీసులు అడ్డుకున్నారు. తమ పిలుపు మేరకు పట్టణ బంద్‌ను పాటించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణ యాదవ్, రాజేష్ రాళ్ల, బండి మహేందర్, లాలా మున్న, చిలుకూరి జ్యోతిరెడ్డి, లోక ప్రవీణ్ రెడ్డి, దినేష్ మాటోలియా, సుభాష్, రాకేష్, రమేష్, విజయ్, రఘుపతి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పాయల శంకర్ చేసిన వ్యాఖ్యలను ఖండించిన పోలీసు అసోసియేషన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సామాజిక మాధ్యమంలో ఆదిలాబాద్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల శంకర్ జిల్లా పోలీసు వ్యవస్థపై, జిల్లా పోలీసులపై నిరాధారమైన ఆరోపణలు చేస్తూ పోలీసులను నిందించడం సరికాదని చేసిన వ్యాఖ్యలను తప్పుపడుతూ జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు వ్యాఖ్యలను ఖండించినట్లు సోమవారం ఒక ప్రకటలో పేర్కొన్నారు. జిల్లా పోలీసు వ్యవస్థ ప్రతి ఒక్క వర్గాన్ని, ప్రతి ఒక పార్టీని ఒకే రకంగా చూస్తూ సమన్యాయ పాలనను జిల్లా ప్రజలకు నిరంతరం అందిస్తుందని తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతలను కాపాడుతుందని పేర్కొన్నారు. ప్రతిక్షణం జిల్లా ప్రజల క్షేమాలను కోరుకుంటూ విధులను నిర్వర్తిస్తుందని గుర్తు చేశారు. పోలీసులకు కులాలు చుట్టరికాలు అంటగడుతూ అభియోగాలు మోపడం సరికాదని తెలిపారు. గతంలో ఇదివరకే పాయల శంకర్ ముఖ్యంగా ఒక మహిళా పోలీసు అధికారినిపై అసభ్యకర పదజాలంతో దూషించి, మహిళల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించారని అన్నారు. 24 గంటలు ప్రజల భద్రతకై అహర్నిశలు కష్టపడి విధులు నిర్వర్తిస్తున్న పోలీసులను కించపరిచే విధంగా పాయల శంకర్ మాట్లాడినందున, తన వ్యక్తిగత ద్వేషాన్ని మనసులో ఉంచుకొని ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా పోలీసుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్న ఆదిలాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పాయల శంకర్ వ్యాఖ్యలను జిల్లా పోలీస్ అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు.

క్రమబద్ధీకరణ దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-దిలావర్‌పూర్

ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణకు మీసేవ ద్వారా ధరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు నర్సాపూర్(జి) తహసీల్దార్ శ్రీకాంత్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అసైన్డ్, అభ్యంతరం లేని ప్రభుత్వ భూమిని తేదీ 02.06.2020లోపు ఆక్రమించుకున్న ఇల్లు కానీ, ఖాళీ స్థలం కలిగి ఉన్నవారు ప్రభుత్వ ఆదేశాల మేరకు తేదీ 27.03.2023 జీఓ నెంబర్ 58, 59 కింద ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని పొన్న గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాధవ్ పటేల్ మాతృమూర్తి అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట సొంపల్లి ఎంపీటీసీ సూర్యకాంత్, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు అశోక్, బోథ్ బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్ పాల్గొన్నారు.